ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 తమిళనాడు TAMILNADU

మంగళవారం 4 జూన్ 2024



జడ్జిమెంట్ డే

● లోక్‌సభ ఎన్నికల బరిలో 950 మంది అభ్యర్థులు

● 39 కేంద్రాల్లో కౌంటింగ్ ● మూడంచెల భద్రత

చెన్నై, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు మంగళవారం వెల్లడి కానున్నాయి. 45 రోజుల నిరీక్షణ అనంతరం భవితవ్యం తేలిపోనుంది. ఇప్పటికే ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు పెంచేయడంతో ఎన్నికల ఫలితం కోసం యావత్ రాష్ట్రంతో పాటు దేశం మొత్తం తమిళనాడు వైపు ఆసక్తిగా గమనిస్తోంది.. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభం కానుంది. దేశం మొత్తమ్మీద ఏడు విడతల్లో లోక్‌సభ ఎన్నికలు జరగ్గా, తొలి విడతలోనే రాష్ట్రంలో ఏప్రిల్ 19న పోలింగ్ ముగిసిన విషయం తెలిసిందే. ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచిన ఎన్నికల కమిషన్ పరిస్థితిని సమీక్షించింది. ఇక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఫలితం కోసం సుదీర్ఘకాలం ఎదురుచూపులు చూశారు.

పకడ్బందీ ఏర్పాట్లు...

రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి సత్యవ్రదసాహూ పర్యవేక్షణలో పకడ్బందీ ఏర్పాట్లతో ఓట్ల లెక్కింపు జరుగనుంది. మూడంచెల భద్రతా ఏర్పాట్ల నడుమ సుమారు లక్షమంది పోలీసుల పహారాలో 39 లోక్‌సభ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. ఈ ఎన్నికల్లో ఇండియా, అన్నాడీఎంకే, ఎన్‌డీఏ కూటములతో పాటు నామ్ తమిళర్ కట్చి, బీఎస్పీ వంటి పార్టీలు పోటీ పడగా, మొత్తం 950 మంది అభ్యర్థులు బరిలో నిలిచా రు.

మంగళవారం కౌంటింగ్ పనుల్లో 38,500 మంది పాల్గొంటు న్నారు. ఓట్లను లెక్కించడంలో 10 వేలమంది, ఈవీఎంలను బల్లలపై సిద్ధం చేసేందుకు 24 వేలమంది, సూక్ష్మ పరిశీలకులు 4500 మంది పాల్గొంటున్నారు. రాష్ట్రంలో 39 లోక్‌సభ నియోజకవర్గాలకు శాసనసభ నియోజకవర్గాలవారీగా పోలైన ఓట్లను వరుసగా లెక్కించనున్నారు. ఒక్కో శాసనసభ నియోజకవర్గానికి ఒక గది చొప్పున 234 గదులు ఏర్పాటు చేశారు. ఒక్కో గదిలో 14 టేబుళ్ల చొప్పున సుమారు 3300 టేబుళ్లపై ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అవసరమైతే 14 కంటే అధికంగానూ బల్లలు ఉపయోగిస్తారు. ఓట్ల లెక్కింపు మంగళవారం ఉదయం ప్రారంభమవుతుంది. ముందుగా తపాలా ఓట్లను లెక్కించి, ఆ తరువాత ఉదయం 8.30 గంటలకు ఈవీఎంలలో పోలైన ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది.

ఓట్ల లెక్కింపు జరిగే ప్రతి బల్ల వద్ద నిఘా కెమెరా అమర్చి కౌంటింగ్ ప్రక్రియ పరిశీలించనున్నారు. ప్రతి నియోజకవర్గానికి నియమితులైన ఎన్నికల పర్యవేక్షకుల సమక్షంలో ఈ కౌంటింగ్ జరుగుతుంది. రౌండ్ల వారీగా జరుగనున్న ఈ లెక్కింపును ఎప్పటికప్పుడు ప్రకటించనున్నారు.

సీసీ కెమెరాలతో నిఘా...

ప్రతి కౌంటింగ్ కేంద్రం వద్ద ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఏప్రిల్ 19 తేదీ రాత్రి నుంచి కేంద్ర పారిశ్రామిక దళం, స్థానిక సాయుధ పోలీసులు కాపలా కాశారు. ప్రతి కౌంటింగ్ కేంద్రం వద్ద అభ్యర్థులు లేదా వారి తరపున నియమితులైన ఏజెంట్లు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కాపలా కాశారు. వీరందరికి స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లోని దృశ్యాలను ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్‌లో వీక్షించే సదుపాయం కూడా కల్పించారు. రాష్ట్రమంతటా సుమారు 40 వేలమంది పోలీసులు కౌంటింగ్ కేంద్రాల్లో బందోబస్తులో ఉన్నారు. వీరితోపాటు రాష్ట్రమంతటా సుమారు 60 వేల మంది పోలీసులు గస్తీ తిరుగుతుంటారు. రాష్ట్రమంతటా సుమారు లక్షమందికి పైగా పోలీసులు ఎన్నికల విధుల్లో పాల్గొంటారని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. వీరితోపాటు 15 కంపెనీల పారామిలిటరీల దళాలు కూడా ఉన్నాయి.

చెన్నైలో...

రాజధాని నగరం చెన్నైలోని మూడు లోక్‌సభ నియోజకవర్గాల ఓట్ల లెక్కించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎన్నికల నిర్వహణాధికారి, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జె.రాధాకృష్ణన్ తెలిపారు. కౌంటింగ్ సిబ్బందిని లాటరీ పద్ధతిలో ఎంపిక చేశామని ఆయన చెప్పారు. మంగళవారం వేకువజాము 4.30 గంటలకల్లా కౌంటింగ్ కేంద్రాల వద్ద లెక్కింపు అధికారులు, పర్యవేక్షకులు, అభ్యర్థులు, ఏజెంట్లు, తదితర సిబ్బంది ఓటింగ్ బల్లల వద్ద సిద్ధంగా ఉంటారని ఆయన వివరించారు. చెన్నై నగరానికి సంబంధించినంతవరకు సౌత్ చెన్నై నియోజకవర్గంలో 41మంది అభ్యర్థులు, సెంట్రల్ చెన్నై నుంచి 31 మంది, నార్త్ చెన్నై నియోజకవర్గంలో 35 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఇదే విధంగా తిరువళ్లూరు లోక్‌సభ నియోజకవర్గంలో 14 మంది, శ్రీపెరుంబుదూరు నుంచి 31 మంది, కాంచీపురం నియోజకవర్గంలో 11 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీటిలో సౌత్‌చెన్నై లోక్‌సభ నియోజకవర్గంలో పోలైన ఓట్లను అన్నా విశ్వవిద్యాలయంలోని కౌంటింగ్ కేంద్రం వద్ద, సెంట్రల్ చెన్నై నియోజకవర్గం ఓట్లను నుంగంబాక్కంలోని లయోలా కళాశాలలోని కౌంటింగ్ కేంద్రం వద్ద, నార్త్ చెన్నై నియోజకవర్గం ఓట్లను మైలాపూరులోని రాణిమేరీ కళాశాల కౌంటింగ్ కేంద్రంలో లెక్కించనున్నారు. ఇదే విధంగా తిరువళ్లూరు నియోజకవర్గ ఓట్లను పెరుమాళ్‌పట్టు శ్రీరామ్ విద్యామందిర్ మెట్రిక్యులేషన్ హయ్యర్‌సెకండరీ స్కూల్ కౌంటింగ్ కేంద్రం వద్ద, శ్రీపెరుంబుదూరు నియోజకవర్గం ఓట్లను క్రోంపేట ఎంఐటీ కళాశాలలో, కాంచీపురం నియోజకవర్గం ఓట్లను పొన్నేరికరై అన్నా విశ్వవిద్యాలయ అనుబంధ ఇంజనీరింగ్ కళాశాలలో లెక్కించనున్నారు.



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న చెన్నై కమిషనర్ జె.రాధాకృష్ణన్

బరిలో హేమాహేమీలు...

తమిళనాట లోక్‌సభ ఎన్నికల్లో ఈ సారి హేమాహేమీలు తలపడుతున్నారు. మరీ ముఖ్యంగా తమిళనాట అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు తీవ్రంగా చెమటోడ్చుతున్న బీజేపీ సీనియర్లను రంగంలోకి దింపింది. బీజేపీ ప్రస్తుత అధ్యక్షుడు అన్నామలైతో పాటు మాజీ అధ్యక్షులు డాక్టర్ తమిళిసై, డాక్టర్ ఎల్.మురుగన్, పొన్ రాధాకృష్ణన్‌లను రంగంలోకి దింపింది. అంతేగాక చెన్నైలో ప్రసిద్ధిచెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త వినోజ్ పి.సెల్వం, సీనియర్ న్యాయవాది పాల్ కనకరాజ్, సీనియర్ నటి రాధికను కూడా బరిలోకి దింపింది. మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం, దివంగత ముఖ్యమంత్రి జయ నెచ్చెలి శశికళ సమీప బంధువు టీటీవీ దినకరన్, ఎస్ఆర్ఎం సంస్థల అధినేత టీఆర్ పారివేందర్ కూడా ఎన్‌డీఏ కూటమి తరపునే పోటీ చేస్తుండడం గమనార్హం. అన్నాడీఎంకే కూటమి నుంచి డీఎండీకే తరపున దివంగత నటుడు విజయకాంత్ తనయుడు విజయ ప్రభాకరన్ విరుదునగర్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి, సీనియర్ నటి రాధికతో తలపడుతున్నారు. 'ఇండియా' కూటమిలో డీఎంకే తరపున ముఖ్యమంత్రి స్టాలిన్ చెల్లెలు కనిమొళి, మేనల్లుడు దయానిధి మారన్, సీనియర్ నేతలు కేంద్ర మాజీ మంత్రులైన టీఆర్ బాలు, ఎ.రాజా, ఎస్.జగద్రక్షకన్, సీనియర్ నేతలైన దురైమురుగన్ కుమారుడు కదిర్ ఆనంద్, ఆర్కాడు వీరాస్వామి కుమారుడు డాక్టర్ కళానిధి వీరాస్వామి, కేఎన్ నెహ్రూ కుమారుడు అరుణ్ నెహ్రూ, దివంగత మాజీ మంత్రి తంగపాండ్యన్ కుమార్తె, మంత్రి తంగం తెన్నరసు సోదరి తమిళచ్చి తంగపాండ్యన్, కాంగ్రెస్ తరపున తెలుగువారైన సీనియర్ నేత కె.గోపీనాథ్, టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు ఎం.కృష్ణస్వామి తనయుడు ఎంకే విష్ణు ప్రసాద్, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం తనయుడు కార్తీ చిదంబరం, సీనియర్ నేత మాణిక్యం ఠాగూర్, ఎండీఎంకే అధినేత వైగో కుమారు డు దురై వైగో, డీపీఐ అధినేత తిరుమావళవన్ బరిలో నిలిచారు.



పన్నీర్‌సెల్వం



ఎల్.మురుగన్



సౌమ్య అన్బుమణి



తిరుమావళవన్



అన్నామలై



టి.ఆర్ బాలు



రాధిక



కనిమొళి



దయానిధి మారన్



ఎ.రాజా




కళానిధి వీరాసామి




లయోలా కాలేజీ ప్రవేశద్వారం వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

విలవంగోడు ఉప ఎన్నిక ఫలితం నేడే

చెన్నై, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 39 లోక్‌సభ నియోజకవర్గాల ఎన్నికలతోపాటు విలవంగోడు శాసనసభ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరిగింది. మంగళవారం ఆ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల ఫలితాలు కూడా వెల్లడికానున్నాయి. లోక్‌సభ ఎన్నికలకు ముందు విలవంగోడు నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయతరణి బీజేపీలో చేరి తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. దీంతో ఆ నియోజకవర్గానికి ఉప ఎన్నిక నిర్వహించారు. ఆ నియోజకవర్గంలో కాంగ్రెస్ తరఫున తారగై కత్‌బర్ట్, బీజేపీ తరఫున వీఎస్ నందిని, అన్నాడీఎంకే తరఫున యు.రాణి, నామ్ తమిళర్ కట్చి తరఫున ఆర్.జెమిని పోటీ చేశారు.. వీరితోపాటు ఆరుగురు ఇండిపెండెంట్లు కూడా పోటీలో ఉన్నారు.



కాంగ్రెస్ అభ్యర్థి తారగై కత్‌బర్ట్



అన్నాడీఎంకే అభ్యర్థి యు.రాణి

పుదుచ్చేరిలో...

కేంద్ర పాలిత్రపాంతమైన పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గం ఎన్నికల ఫలితాలు కూడా మంగళవారం వెలువడనున్నాయి. ఆ నియోజకవర్గంలో కాంగ్రెస్ తరఫున మాజీ ముఖ్యమంత్రి వి.వైద్యలింగం, బీజేపీ తరఫున రాష్ట్ర మంత్రి ఎ.నమశ్శివాయం, అన్నాడీఎంకే తరఫున జి.తమిళ్‌వేందన్, నామ్ తమిళర్ కట్చి తరఫున ఆర్.మేనక పోటీ చేశారు.

8న వర్షసూచన

● వాతావరణ శాఖ వెల్లడి



అడయార్, జూన్ 3: రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో మంగళవారం నుంచి ఈ నెల 8వ తేదీ వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెన్నై ప్రాంతీయ కార్యాలయం వెల్లడించింది. నైరుతి రుతుపవనాలు తమిళనాడుతో పాటు పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాలపై విస్తరించి వున్నాయి. దీనికితోడు దక్షిణ తమిళనాడు ఉపరితలంపై బాహ్య ఆవర్తన ద్రోణి ఏర్పడింది. దీని కారణంగా రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలతో పాటు పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని , ఈ నెల 5వ తేదీ వరకు ఈదురు గాలులతో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తాయని తెలిపింది. అదేవిధంగా సేలం, కళ్ళకుర్చి, విల్లుపురం, కాంచీపురం, ధర్మపురి, తిరుపత్తూరు, వేలూరు, రాణిపేట తదితర జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో ఈ నెల 5వ తేదీ వరకు వర్షంపడే అవకాశం ఉందన్నారు. ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలతో పాటు పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాలకు వర్ష సూచన ఉందని తెలిపింది. చెన్నై నగరంలో వచ్చే 24 గంటల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి, మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మరోవైపు, రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతో సూర్యతాపం కొంతమేరకు తగ్గి, వాతావరణం చల్లడింది.

ఈ రెండు జిల్లాల్లో భారీ వర్షం

మరోవైపు పెరంబలూరు, పుదుకోట జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. డెల్టా జిల్లాలైన తిరువారూరు, తంజావూరు జిల్లాల్లో సోమవారం తేలికపాటి వర్షాలు కురిశాయి. ఆదివారం రాత్రి 7 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు భారీ వర్షం కురిసింది. పుదుకోట జిల్లాలో ఆదివారం రాత్రి గంటపాటు భారీ వర్షం కురిసింది. పెరంబలూరు జిల్లాలో వేప్పంతడై, కున్నం అరుంబావూరు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి 8.30 నుంచి 10 గంటల వరకు వర్షం కురిసింది. తిరుచ్చి జిల్లాలో తా.పేట, ముసిరి తొట్టియం, దురైయూర్, మన్నచ్చనల్లూరు, లాల్‌కుడి, మణప్పారై, తువరంకురిచ్చి తదితర ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది.

పిడుగుపాటుకు నాలుగు దుకాణాల దగ్ధం

తిరువణ్ణామలైలో ఆదివారం రాత్రి పిడుగులతో వర్షం కురిసింది. కొబ్బరి, తాటి చెట్లతో పాటు కొన్ని దుకాణాలపై పిడుగులు పడి అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో నలుగురు వ్యాపారులు గాయపడ్డారు. అయ్యపాళెయంకు చెందిన అరవిందన్ (21), అదే ప్రాంతానికి చెందిన సతీష్ కుమార్ (19), పవన్ కుమార్ (30), ముత్తుకుమరన్ (19) అనేవారు గాయపడగా సమీపంలోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఘనంగా కరుణ జయంతి

● సమాధివద్ద స్టాలిన్ నివాళి ● సహాయ కార్యక్రమాలు చేపట్టిన పార్టీ శ్రేణులు

చెన్నై, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి 101వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఆ సందర్భంగా పలుచోట్ల కరుణ చిత్రపటాలకు పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నదాన కార్యక్రమాలు, చలివేంద్రాల్లో మజ్జిగ పంపిణీ, నిరుపేదలకు సహాయాల పంపిణీ తదితర సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. కరుణ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పార్టీ నేతలు, మంత్రులు, ఎంపీలతో కలిసి మెరీనా బీచ్‌లోని కరుణ సమాధి వద్ద నివాళులర్పించారు. ఆ సందర్భంగా కరుణానిధి శతజయంతి ముగింపు వేడుకలను పురస్కరించుకుని మూడు ప్రత్యేక సంపుటాలను సీఎం ఆవిష్కరించారు. వాటిని పార్టీ సీనియర్ నాయకుడు, నీటివనరుల శాఖ మంత్రి దురైమురుగన్ స్వీకరించారు. అనంతరం ఆయన రాష్ట్ర పౌరసంబంధాలు సమాచార శాఖ ఆధ్వర్యంలో కరుణానిధి జీవిత విశేషాలపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ తిలకించారు. ఈ కార్యక్రమాలను ముగించుకుని స్టాలిన్ ఓమందూరార్ ఎస్టేట్ ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ కరుణానిధి కాంస్య విగ్రహానికి పూలమాల వేసి, విగ్రహం దిగువన కరుణ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. అంతకు ముందు ఆయన గోపాలపురంలోని కరుణానిధి నివాసానికి వెళ్లి కరుణ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. అక్కడి నుంచి సీఐటీ కాలనీలోని కరుణ సతీమణి రాజాత్తి అమ్మాళ్ నివాసానికి వెళ్లి రాజాత్తి అమ్మాళ్, ఎంపీ కనిమొళి, స్టాలిన్ కలిసి కరుణ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఇదే విధంగా తేనాంపేటలోని అన్నా అరివాలయం, కోడంబాక్కంలోని మురసొలి పత్రిక కార్యాలయం వద్దనున్న కరుణ విగ్రహాలకు కూడా స్టాలిన్ నివాళులర్పించారు. మంత్రులు కేఎన్ నెహ్రూ, పీకే శేఖర్‌బాబు, సి.పొన్ముడి, ఉదయనిధి, ఎంపీలు కనిమొళి, ఏ రాజా తదితరులు పాల్గొన్నారు. ఇదే విధంగా ముఖ్యమంత్రి స్టాలిన్ సతీమణి దుర్గాస్టాలిన్, కరుణానిధి సతీమణి రాజాత్తిఅమ్మాళ్, కుమార్తె కనిమొళి తదితరులు కరుణ సమాధిని సందర్శించి పుష్పాంజలి ఘటించారు.



రాజాత్తి అమ్మాళ్ నివాసంలో కరుణ చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న స్టాలిన్



మెరీనాబీచ్‌లోని కరుణానిధి సమాధివద్ద నివాళులర్పిస్తున్న సీఎం స్టాలిన్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు



అన్నా అరివాలయం వద్ద మాజీ ముఖ్యమంత్రులు అన్నాదురై, కరుణానిధి విగ్రహాలకు నివాళులర్పిస్తున్న సీఎం స్టాలిన్, మంత్రులు తదితరులు

25 శాతం కంటే ఓటింగ్ తగ్గితే పార్టీలో ప్రక్షాళనే

● ఎడప్పాడి యోచన



మురుగన్ ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేస్తున్న ఎడప్పాడి పళనిస్వామి

చెన్నై, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి సహా 40 లోక్‌సభ నియోజకవర్గాల్లో అన్నాడీఎంకే, దాని మిత్రపక్షాల అభ్యర్థులకు 25 శాతం కంటే ఓటింగ్ తగ్గితే ఆయా జిల్లాలకు చెందిన పార్టీ నేతలు, మాజీ మంత్రులపై వేటు వేయాలని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి భావిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ తర్వాత వెలువడిన సర్వే ఫలితాలన్నీ పార్టీకి రెండు మూడు సీట్లే వస్తాయని పేర్కొనటంతో ఇప్పటికే పార్టీ వర్గాల్లో తీవ్ర కలకలం బయలుదేరింది. ఈ ఎన్నికల్లో బీజేపీతో తెగతెంపులు చేసుకుని, డీఎండీకే తదితర పార్టీలతో పొత్తుపెట్టుకుని అన్నాడీఎంకే కూటమి బరిలోకి దిగిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఎన్నికల ఫలితాలను బట్టి అన్నాడీఎంకే అభ్యర్థులను గెలిపించే బాధ్యత తీసుకున్న జిల్లా ఇన్‌ఛార్జీలు, మాజీ మంత్రులపై ఈపీఎస్ కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఎన్నికల సర్వే ఫలితాలను ఉటంకిస్తూ నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలతో ఈపీఎస్ మాట్లాడారు. ప్రతి నియోజకవర్గంలో 25 శాతానికి మించి పార్టీ అభ్యర్థులకు ఓట్లు పడితేనే పార్టీ ప్రతిష్ట పెరుగుతుందన్నారు. 25 శాతాని కంటే తక్కువగా ఓట్లు వస్తే ఇన్‌ఛార్జీలను ఇంటికి సాగనంపేందుకు తాను వెనుకాడబోనని ఆయన హెచ్చరించారు. ఈ ఎన్నికల ఫలితాల తర్వాత పార్టీలో భారీ మార్పులు తథ్యమని అయితే అభ్యర్థుల విజయం, పార్టీ అభ్యర్థులకు, మిత్రపక్షాల అభ్యర్థులకు పోలయ్యే ఓట్ల శాతాన్ని బట్టి పదవుల పంపకం లేదా పదవుల నుంచి ఉద్వాసన జరుగుతుందని ఈపీఎస్ అన అనుచరులకు చెప్పారు. ఈ విషయమై పార్టీ సీనియర్ నేతలు కొందరు మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో పెద్ద గెలుపు రాకపోయినా, కనీసం పది స్థానాలలో గెలిస్తేనే పార్టీ ప్రతిష్ట పెరుగుతుందని ఈపీఎస్ చెబుతున్నారని, రాష్ట్ర ప్రజలంతా డీఎంకేపై తీవ్ర వ్యతిరేకత ప్రదర్శిస్తుంటే ఆ కూటమి 30 కంటే ఎక్కువ స్థానాల్లో ఎలా గెలుస్తుందంటూ ఈపీఎస్ ప్రశ్నిస్తున్నారని తెలిపారు.

మురుగన్ ఆలయంలో పూజలు...

సేలం జిల్లా ఆత్తూరు సమీపంలోని పెద్దనాయకన్‌పాళయంలోని ముత్తుమలై మురుగన్ ఆలయంలో ఎడప్పాడి పళనిస్వామి సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శూలాయుధాన్ని పట్టుకుని ఆలయ ప్రదక్షిణ చేసి గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శనం చేసుకున్నారు. చివరగా ధ్యానమండపంలో కాసేపు ధ్యానం చేశారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులందరికీ అన్నాడీఎంకే తరపున అన్నదానం చేశారు. అన్నాడీఎంకే జిల్లా శాఖ కార్యదర్శి ఇలంగోవన్, శాసనసభ్యులు ఆత్తూరు జయశంకరన్, కెంగవల్లి నల్లతంబి తదితరులు ఈపీఎస్ వెంట పర్యటించారు.

కుల, మత ఆధారిత ఓట్ల పర్యవేక్షణకు కమిషన్

హైకోర్టులో పిటిషన్ ● అభిప్రాయం చెప్పాలని ఈసీకి ఆదేశం

పెరంబూర్, జూన్ 3: కులం, మతం, భాషా పరంగా ఓట్ల సేకరణలో జరిగే అవినీతి చర్యల పర్యవేక్షణకు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో స్వతంత్ర కమిషన్ ఏర్పాటు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై కౌంటర్ అఫిడవిట్ వేయాలని కేంద్ర ఎన్నికల సంఘానికి మద్రాసు హైకోర్టు నోటీసులు జారీచేసింది. వేలూరు జిల్లా సత్తువాచేరికి చెందిన రాజేష్ అనూర్ మహిమైదాస్ మద్రాసు హైకోర్టులో దాఖలుచేసిన ప్రజావ్యాజ్యంలో... కులం, మతం, భాషా పరంగా ఓట్లు సేకరించడం అవినీతికి పాల్పడడమేనని, అలాంటి చర్యలను అనుమతించరాదన్నారు. విద్వేషపూరిత ప్రసంగాలు అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు, ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని వివిధ కేసుల్లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. కానీ, ఎన్నికలు, ఇతర సమయాల్లో గుర్తింపు పొందిన రాజకీయపార్టీలు, ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు తమ స్వప్రయోజనాల కోసం ఓటర్ల మధ్య కులం, మతం, భాషా ప్రాతిపదికన చీలికలు సృష్టిస్తున్నాయని తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రమే ఇలాంటి కార్యకలాపాలు జరుగకుండా ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోందని, కానీ, ఎన్నికల తర్వాత ఈ కార్యకలాపాలు నిరోధించేందుకు ఎలాంటి నిబంధనలు లేవని తెలిపారు. ఈ కార్యక్రమాలపై సుప్రీంకోర్టు నిర్ణయాలను ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు తెలియజేయాలన్నారు. ఈ తీర్పుల అమలు పర్యవేక్షణకు మాజీ న్యాయమూర్తులు, మానవ హక్కుల కమిషన్ కార్యకర్తలతో కూడిన స్వతంత్ర కమిషన్ ఏర్పాటు చేయాలని ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.మహాదేవన్, న్యాయమూర్తి జస్టిస్ మహమ్మద్ షఫీక్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ఈ వ్యవహారంపై ఆరువారాల్లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది.



టూరిస్టు వ్యాన్ బోల్తా.. ఒకరి మృతి

10 మందికి గాయాలు

చెన్నై, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మదురై సమీపం మేలూరు వద్ద సోమవారం వేకువజామున టూరిస్టు వ్యాన్ బోల్తాపడి ఒకరు మృతి చెందగా, పదిమంది గాయపడ్డారు. కన్నియాకుమారి నుంచి కొంతమంది వేలాంగన్ని ఆలయానికి వ్యాన్‌లో వెళ్ళారు. దైవదర్శనానంతరం అందరూ ఆదివారం అర్ధరాత్రి స్వస్థలానికి బయలుదేరారు. ఆ వ్యాన్ మదురై జిల్లా మేలూరు సమీపం తుంబైపట్టి వద్ద వెళుతుండగా అదుపుతప్పి రోడ్డుపై బోల్తాపడింది. ఈ దుర్ఘటనలో జస్టిస్ (40) అనే వ్యక్తి మరణించాడు. వ్యాన్‌లో ఉన్న స్టైలా, లేడింగ్‌జాన్, జల్సామేరీ, రాజకుమారి సహా కన్నియాకుమారి జిల్లాకు చెందిన 10 మంది గాయపడ్డారు. ఈ ప్రమాదం గురించి తెలియగానే పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో వెళ్ళి వ్యాన్ శిథిలాల మధ్య చిక్కుకున్నవారిని వెలికి తీసి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.



బోల్తాపడిన వ్యాన్ వద్ద పరిశీలన జరుపుతున్న పోలీసులు

హత్యకు దారితీసిన వివాహేతర సంబంధం

చెన్నై, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కడలూరు తిరుపాదిరిపులియూరు సమీపం కమ్మియంపేటలో పనిచేస్తున్న విక్టర్ (40) అనే ఉపాధ్యాయుడు వివాహేతర సంబంధం నేపథ్యంలో దారుణ హత్యకు గురయ్యారు. హంతకులు ఆయన మృతదేహాన్ని గోనెసంచిలో కుక్కి నైవేలి అగ్నిమాపక కేంద్రం వద్ద పారేసి వెళ్ళారు. విక్టర్ కొన్నేళ్ళ క్రిందట భార్యతో మనస్పర్థల కారణంగా విడిపోయి, కడలూరు తంగరాజ్ నగర్‌లో నివసిస్తున్నారు. మే 18న ఆయన హఠాత్తుగా మాయమయ్యాడు. ఈ విషయమై కుటుంబీకులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టారు. ఆయన సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా కురింజిపాడికి వెళ్ళినట్లు గుర్తించారు.. ఆ మేరకు పోలీసులు అక్కడికి వెళ్ళి విక్టర్‌తో గతంలో గొడవలు పెట్టుకున్న దక్షిణామూర్తి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో అనేక విషయాలు వెలుగు చూశాయి. తనతో సంబంధం కలిగిన మహిళతో విక్టర్ వివాహేతర సంబంధం పెట్టుకున్నందువల్ల కోపంతో అతడిని హతమార్చినట్లు తెలిపాడు. ఆ తర్వాత శవాన్ని గోనెసంచిలో కట్టి ఎవరికీ అనుమానం కలగలకుండా నైవేలి అగ్నిమాపక కేంద్రం వద్ద పారేసినట్లు తెలిపారు. ఈ వాంగ్మూలంతో దక్షిణామూర్తిని పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు.

కోల్‌కతా విమానానికి బాంబు బెదిరింపు

చెన్నై, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మీనంబాక్కం జాతీయ విమానాశ్రయం నుంచి సోమవారం ఉదయం కోల్‌కతాకు బయలుదేరటానికి సిద్ధంగా ఉన్న ఇండిగో విమానంలో బాంబులు పేలతాయంటూ గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేయడంతో విమానాశ్రయంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. 168 మంది ప్రయాణికులతో ఆ విమానం ఉయదం 8.30 గంటలకు బయలుదేరటానికి సిద్ధమైంది. ఆ సమయంలో తురైపాక్కంలోని ఇండిగో సంస్థ కార్యాలయానికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌చేసి ఆ విమానంలో బాంబులు పేలనున్నట్లు బెదిరించాడు. దీంతో ఆ సంస్థ అధికారులు విమానాశ్రయం కంట్రోల్‌రూమ్ అధికారులకు ఫోన్ చేసి తెలిపారు. వెంటనే విమానాశ్రయ భద్రతాదళం, బాంబ్ స్క్వాడ్ ప్రయాణికులను కిందకి దింపి గంటసేపు తనిఖీ చేశారు. ఆ తర్వాత విమానం రెండున్నర గంటలు ఆలస్యంగా ఉదయం 10.40గంటలకు కోల్‌కతాకు బయలుదేరింది. ఇండిగో సంస్థ విమానాలకు తరచూ ఇలాంటి బాంబు బెదరింపులు వస్తున్నాయిని ఆ సంస్థ అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఇండిగో విమానానికి బాంబు బెదరింపు చేసిన వ్యక్తి ఆచూకీ కోసం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

పిడుగుపాటుకు రైతు మృతి

పెరంబూర్, జూన్ 3: తేని జిల్లా ఆండిపట్టి సమీపంలో పిడుగుపాటుకు రైతు మృతిచెందాడు. ఆండిపట్టి పరిసర ప్రాంతాల్లో సోమవారం ఉదయం ఉరుములు, పిడుగులతో కూడిన భారీవర్షం కురిసింది. ఈ సమయంలో పొలంలో ఉన్న రైతు సెల్లపాండి సమీపంలోని చెట్టు కిందకు వెళ్లాడు. అతనికి కొద్ది దూరంలో పడిన పిడుగుపాటుకు గురై సెల్లపాండి ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రూ.25 కోట్లతో కలైంజర్ సెంటినరీ పార్క్

● రోప్‌కార్, అద్దాల భవనం ఏర్పాటు

పెరంబూర్, జూన్ 3: స్థానిక రాధాకృష్ణన్ రోడ్డులో నిర్మిస్తున్న కలైంజర్ సెంటినరీ పార్క్‌లో రూ.25 కోట్లతో ప్రత్యేక అంశాలు చోటుచేసుకోనున్నాయి. ఉద్యానవన శాఖకు చెందిన, ఆక్రమణలకు గురైన 6.9 ఎకరాల స్థలాన్ని కోర్టు ఉత్తర్వులతో ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఈ స్థలంలోని 6 ఎకరాల్లో కలైంజర్ సెంటినరీ పార్క్ ఏర్పాటుచేస్తున్నట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, పార్క్ నిర్మాణానికి ఫిబ్రవరి 29వ తేది శంకుస్థాపన చేశారు. ఈ పార్క్‌లో అద్దాల భవనం, 10 అంతస్తులతో సూపర్ ట్రీ గోపురం, రోప్ కార్ తదితరాలు ఏర్పాటుకానున్నాయి. అలాగే, వాకింగ్ ట్రాక్, పిల్లలు, పెద్దలు సేదతీరేలా ఉద్యానవనం, క్రీడామైదానం ఏర్పాటుకానున్నాయని అధికారులు తెలిపారు.

నగరంలో 350 బాటిళ్ల తల్లి పాలు స్వాధీనం



మందుల దుకాణంలో తనిఖీలు జరుపుతున్న ఆహార భద్రతా విభాగం అధికారులు

పెరంబూర్, జూన్ 3: స్థానిక అరుంబాక్కం ఆర్కే ఫార్మా సంస్థలో 350 తల్లి పాల బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఆహార భద్రతా శాఖ అధికారులు, ఈ వ్యవహారంపై విచారణ చేపట్టారు. ఈ విషయమై అందిన ఫిర్యాదుతో అధికారులు ఆ సంస్థలో తనిఖీలు చేపట్టారు. 50 మి.లీ తల్లిపాలు రూ.900 నుంచి రూ.1,239 వరకు విక్రయిస్తున్నట్లు విచారణలో తెలిసింది. ఈ తనిఖీల్లో 350 బాటిల్స్ తల్లిపాలు స్వాధీనం చేసుకున్నారు. కాగా, కొద్దిరోజుల క్రితం మాధవరంలో ఓ మందుల దుకాణంలో తల్లిపాల బాటిళ్ల అధికారులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.

ఫోన్ చేస్తే...ఇంటికే మద్యం...!

ప్యారీస్, జూన్ 3: కిరాణా సరుకులు, మందులు, గృహోపకరణాల్లాగే ఇకపై ఫోన్ చేసినా, ఆన్‌లైన్‌లో ఆర్డరు చేసినా మద్య ఇంటికే అందజేసేలా వ్యాపార వృత్తి బాగా అభివృద్ధి చెందింది. రాష్ట్రవ్యాప్తంగా టాస్మాక్ మద్యం విక్రయ చిల్లర దుకాణాల్లో మందుబాబుల రద్దీ రోజురోజుకు పెరుగుతుండడం, రాత్రి 10 గంటలు దాటాక మద్యం అందుబాటులో లేకపోవడం, మద్యం దుకాణాలకు వెళ్లి తమకిష్టమైన మద్యం రకాలు కొనుగోలుకు సిగ్గుపడే వారి కోసం ఇక నుంచి ఫోన్‌లో ఆర్డరిస్తే చాలు, వారున్న ప్రాంతానికే మద్యం రకాలు సరఫరా చేసే వ్యాపారంలో పలువురు పాల్గొంటూ ఆర్థికంగా లబ్ధిపొందుతున్నారు. రెడ్‌హిల్స్ సమీపంలోని శరత్ కండిగై, ఆవడి, కాటూర్, అయ్యపాక్కం, చోళవరం, మాధవరం, మనలి తదితర ప్రాంతాల్లో ప్రస్తుతం ఈ మొబైల్ సేవలు జోరుగా సాగుతున్నాయి. వాట్సాప్‌గ్రూపుల ద్వారా మద్యం కావాలనుకున్న వారు ఆ నెంబర్లను సంప్రదించాల్సి ఉంది. ఈ వివరాలు గోప్యంగా ఉంచి మందుబాబులకు రహస్యంగా మద్యం చేరవేస్తున్నారు. దూరాన్ని బట్టి రేటు నిర్ణయిస్తున్నారు. అయితే మందుబాబులు ఈ అదనపు భారం గురించి ఆలోచించకుండా ఉన్న చోటుకే తక్కువ సమయంలో మద్యం అందుతుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కిరాణా షాపుల్లో...

రెడ్‌హిల్స్ సమీపంలోని మమ్మద్‌కుళం, శరత్‌కండిగై, ఆవడి ప్రాంతాల్లో ఉన్న కిరాణా షాపుల్లో కూడా మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మద్యం విక్రయించడం వల్ల వాటర్ బాటిళ్లు, గ్లాసులు, చిరుతిండ్ల వ్యాపారం కూడా లాభసాటిగా సాగుతుండడంతో వ్యాపారులు దీనిపై ఆసక్తి చూపిస్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాల నుంచి వలసవచ్చిన భవన నిర్మాణ కార్మికులు, కూలీలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో రాత్రి 10 గంటల తర్వాత కూడా మద్యం విక్రయాలు సాగుతున్నాయని, అయితే దీనిపై పోలీసు శాఖ కానీ, టాస్మాక్ సంస్థ కానీ ఎలాంటి చర్యలు చేపట్టకుండా మౌనం వహించడం ఎందుకోనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కలైంజర్‌కు ఘననివాళి



అన్నదానం ప్రారంభిస్తున్న దృశ్యం

వేలూరు, జూన్ 3: స్థానిక కార్పొరేషన్ ఆధ్వర్యంలో సోమవారం దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలో కరుణానిధి చిత్రపటానికి డీఎంకే నేతలు మహమ్మద్ సఖీ, చక్రవర్తి, కౌన్సిలర్లు పూలమలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని మేయర్ సుజాత ఆనందకుమార్ ప్రారంభించారు.

ఈదురుగాలులకు ఎగిరిపోయిన ఇళ్ల పైకప్పులు



పెరంబూర్, జూన్ 3: విల్లుపురం సమీపం కానైకుప్పం గ్రామంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలుల కారణంగా ఆ ప్రాంతంలోని సుమారు 10కి పైగా ఇళ్ల పైకప్పు ఎగిరిపోయాయి.. అలాగే, గాలుల దాటికి చెట్లు కూలి విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దెబ్బతిన్న ఇళ్లకు పరిహారం అందించాలని బాధితులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ప్రధాని మోదీ ధ్యానానికి మూడు గంటల్లో తయారైన పీఠం

పెరంబూర్, జూన్ 3: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కన్నియాకుమారిలో మూడు రోజుల ధ్యానం చేసేందుకు కూర్చున్న పీఠం, మూడు గంటల్లో తయారుచేసినట్లు వార్తలు వెలువడుతున్నాయి. కన్నియాకుమారి సముద్ర తీరం మధ్యలో వివేకానంద స్మారక మందిరానికి గత నెల 30వ తేది చేరుకున్న ప్రధాని ఈ నెల 1వ తేది సాయంత్రం వరకు, ఓ పీఠంపై కూర్చొని ధ్యానం చేసిన ఫొటోలు వెలువడ్డాయి. ప్రధాని మోదీ ధ్యానం సమయంలో కూర్చున్న పీఠం మూడు గంటల్లోనే తయారైంది. ఈ పీఠాన్ని అచారిపల్లం సమీపం కీళశంకరకుళి ప్రాంతానికి చెందిన శివనేశన్ తయారుచేశారు. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ... ప్రధాని ధ్యానం చేసేందుకు కూర్చొనే పీఠం కావాలని అధికారులు గత నెల 30వ తేది తెల్లవారుజామున 5.30 గంటలకు కోరారన్నారు. తన స్నేహితుడి ద్వారా టేకు చెట్టు తెప్పించి డిజైన్ చేసి వెంటనే పనులు ప్రారంభించానని తెలిపారు. పీఠం తయారీకి తనతో పాటు మరో ఇద్దరు పనిచేశారని తెలిపారు. సాధారణంగా ధ్యానం చేసే పీఠం చేసేందుకు చెట్టుతో కలిపి రూ.25,000 అవుతుందన్నారు. ప్రధాని కూర్చొనే పీఠం కావడం, త్వరగా తయారుచేయాల్సి ఉండడంతో ధర కొంచెం అధికమైందని తెలిపారు. 6 అడుగుల ఎత్తు, 3 అడుగుల పొడవు, 2.5 అడుగల వెడల్పుతో పీఠం తయారుచేశామని, అందులో 3 అంగుళాల మేర కుషన్ ఏర్పాటుచేశామని తెలిపారు. 130 కోట్ల మంది ప్రజల ప్రతినిధిగా అయిన ప్రధాని నరేంద్ర మోదీ తాను చేసిన పీఠంపై కూర్చొని ధ్యానం చేయడం ఎంతో తృప్తి కలిగించిందని తెలిపారు. 27 ఏళ్ల నుంచి ఈ వృత్తిలో ఉన్న తనకు ప్రస్తుతం 52 ఏళ్లని శివనేశన్ తెలిపారు.



టేకుతో తయారుచేసిన ధ్యాన పీఠం(అంతర్ చిత్రంలో) శివనేశన్

సమాచార దర్శిని

7 వరకు కలైంజర్ ఫొటో ఎగ్జిబిషన్

పెరంబూర్, జూన్ 3: స్థానిక తేనాంపేట అన్నా అరివాయంలో ఏర్పాటుచేసిన కలైంజర్ ఫొటో ఎగ్జిబిషన్ ఈ నెల 7వ తేది వరకు పొడిగించారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంత్యుత్సవాల్లో భాగంగా ఆయన జీవిత చరిత్రకు సంబంధించిన ఫొటో ప్రదర్శన గత నెల 30వ తేది ప్రారంభించిన విషయం తెలిసిందే.

తమిళంపై 28,29 తేదీల్లో సదస్సు

ఐసిఎఫ్, జూన్ 3: సమాచార సాంకేతిక శాఖలో తమిళంపై ఈనెల 28,29 తేదీల్లో చెన్నై వాణిజ్య కేంద్రంలో సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సులో రాష్ట్ర ఈ-గవర్నర్స్, ఎల్కాట్, టైడల్ పార్క్, అన్నా వర్సిటీ, అంతర్జాతీయ సంస్థల నిపుణులు పాల్గొననున్నారు. ఈ విషయమై నిర్వాహకులు మాట్లాడుతూ...సాంకేతికశాఖలో తమిళనాడు మూడో స్థానంలో ఉందని తెలిపారు. ఈ శాఖలో రోబోటిక్, కృత్రిమ మేధ ప్రమేయం ఎక్కువగా ఉందన్నారు. కొత్త ఆవిష్కరణలు, ప్రదర్శనలు, విద్యార్థులకు ఉద్యోగ అవకాశాల కోసం ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు.

విమానాశ్రయ సమీపంలో లేజర్ లైట్ల నిషేధం

ఐసిఎఫ్, జూన్3: విమానాశ్రయ సమీపంలో లేజర్ లైట్లను నిషేధాన్ని జూలై 7వ తేది వరకు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ పొడిగించారు. విమానాలు ల్యాండింగ్ సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు పచ్చ, పసుపు, ఎరుపు రంగుల్లో లేజర్ లైట్లు వేస్తుండడంతో విమానాలు సిగ్నల్‌గా భావించి అదుపుతప్పి ప్రమాదాలకు లోనవుతున్నాయని, దీనిని అడ్డుకొనేలా ఈ లైట్లపై నిషేధం విధించామని అధికారులు తెలిపారు. లేజర్ లైట్లతోపాటు లైట్లు అమర్చిన బెలూన్లు, ఇతర వస్తువులు ఎగురవేయడంపై నిషేధాన్ని జూలై 7 వరకు నిషేధం విధించారు.

కౌంటింగ్ కేంద్రాలకు నిరంతరాయంగా విద్యుత్

పెరంబూర్, జూన్ 3: కౌంటింగ్ కేంద్రాల్లో విద్యుత్ కోత లేకుండా పర్యవేక్షించాలని విద్యుత్ బోర్డు ఆదేశించింది. లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు రాష్ట్ర వ్యాప్తంగా జరుగనుంది. కౌంటింగ్ ప్రక్రియకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందేలా ప్రధాన ఇంజనీర్లు పర్యవేక్షించాలని, కేంద్రాల సమీపంలోని ఉప విద్యుత్ కేంద్రాల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ మరమ్మతులు సత్వరం సరిచేయాలని విద్యుత్ బోర్డు తెలిపింది.

యోగా దినోత్సవం నిర్వహించాలి

పెరంబూర్, జూన్ 3: ఉన్నత విద్యా సంస్థలు, కళాశాలలు యోగా దినోత్సవాన్ని నిర్వహించాలని యూజీసీ సర్క్యులర్ జారీ చేసింది. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా యోగా చేయడం ద్వారా శారీరకంగా, మానసికంగా కలిగే ప్రయోజనాలు వివరించేలా ప్రత్యేక సదస్సులు ఏర్పాటుచేయడంతో పాటు ఈ రోజున విద్యార్థులకు యోగాసనాలపై తెలియజేయాలని యూజీసీ తెలియజేసింది.

నేడు మద్యం దుకాణాలకు సెలవు

ఐసిఎఫ్, జూన్ 3: ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మద్యం దుకాణాలకు మంగళవారం టాస్మాక్ సంస్థ సెలవు ప్రకటించింది. ఏడు విడతలుగా జరిగిన లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం జరుగనుంది. దేశవ్యాప్తంగా గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. రాష్ట్రంలో లక్ష మందికి పైగా పోలీసులను భద్రతకు నియమించారు. ఈ నేపథ్యంలో, అసంభావిత ఘటనలు అడ్డుకొనేలా మద్యం దుకాణాలను మంగళవారం మూసివేయనున్నారు.

జల విద్యుదుత్పత్తి ప్రారంభం

ఐసిఎఫ్, జూన్ 3: లోయర్ క్యాంప్‌లో ఉన్న పెరియార్ జలవిద్యుత్ కేంద్రంలో రెండు నెలల అనంతరం ఉత్పత్తి ప్రారంభమైంది. ఇక్కడ తలా 42 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లలో ఉత్పత్తి జరుగుతోంది. ఏప్రిల్ నుంచి పర్యవేక్షణ నిమిత్తం ఉత్పత్తి నిలిపివేశారు. పనులు పూర్తికావడంతో ఆదివారం నుంచి ఉత్పత్తి ప్రారంభించారు.

810 మెగావాట్ల ఉత్పత్తి నిలిపివేత...

మేట్టూరులో 810 మెగావాట్ల విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. ఈ కేంద్రం రెండు విభాగాల్లో పనిచేస్తోంది. మొదటి విభాగంలో తలా 210 మెగావాట్ల సామర్థ్యంతో నాలుగు యూనిట్లు, రెండో విభాగంలో 600 మెగావాట్ల సామర్థ్యంతో ఒక యూనిట్ పనిచేస్తున్నాయి. ప్రస్తుతం పవన విద్యుత్ ఎక్కువగా లభిస్తుండడంతో రెండో విభాగంలో 600 మెగావాట్లు, మొదటి విభాగంలో 210 మెగావాట్ల ఉత్పత్తిని అధికారులు నిలిపివేశారు.

త్వరలో మెము రైళ్లలో అదనపు టాయిలెట్లు

ఐసిఎఫ్, జూన్ 3: మెము రైళ్లలో అదనంగా టాయిలెట్లు ఏర్పాటుచేయనున్నట్లు దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైళ్లు నగరం నుంచి 114 కి.మీ మేరకు నడుస్తున్నాయి. చెన్నై బీచ్-తాంబరం-చెంగల్పట్టు, సెంట్రల్-గుమ్మిడిపూండి, తిరువళ్లూర్ సహా వివిధ మార్గాల్లో ప్రతిరోజు 450కి పైగా రైళ్లు నడుపుతున్నారు. అలాగే, దూర ప్రాంతాలైన మేల్‌మరువత్తూర్, తిరుత్తణి, బిట్రగుంట తదితర ప్రాంతాలకు 12కు పైగా మెము రైళ్లు నడుపుతున్నారు. ఈ రైళ్లలో ఇదివరకే తలా రెండు టాయిలెట్లు ఉండగా, త్వరలో నాలుగు టాయిలెట్లు ఏర్పాటుచేయనున్నామని అధికారులు తెలిపారు.

ప్లస్ వన్, ప్లస్ టూ సప్లిమెంటరీ టైంటేబుల్ విడుదల

పెరంబూర్, జూన్ 3: ప్లస్ వన్, ప్లస్ టూ సప్లిమెంటరీ పరీక్షల టైంటేబుల్ విడుదలైంది. ప్లస్ వన్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని విద్యార్థులు మరో సంవత్సరం నష్టపోకుండా వారికి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల దరఖాస్తు స్వీకరణ గత మే 16వ తేది ప్రారంభమై ఈ నెల 1వ తేదీతో ముగిసింది. ఆ ప్రకారం, ప్లస్ టూ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24న ప్రారంభమై జూలై 1వ తేది వరకు, ప్లస్ వన్ పరీక్షలు జూలై 2న ప్రారంభమై 9వ తేది వరకు జరుగుతాయని ప్రభుత్వ పరీక్ష శాఖ తెలియజేసింది.

న్యాయమూర్తి ఇంటికి తీసుకెళ్తుండగా ఖైదీ పరార్

పెరంబూర్, జూన్ 3: న్యాయమూర్తి ఇంటికి తీసుకెళ్తున్న సమయంలో తప్పించుకు పారిపోయిన విచారణ ఖైదీ దీపన్‌రాజ్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. హత్యాయత్నం కేసులో దీపన్‌రాజ్ సహా ఇద్దర్ని అరెస్ట్ చేసిన పోలీసులు, ఆదివారం కోర్టుకు సెలవు కావడంతో, న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచేందుకు మదురైలో ఆయన ఇంటికి తీసుకెళ్లారు. ఆ సమయంలో పోలీసుల నుంచి తప్పించుకున్న దీపన్‌రాజ్, సమీపంలోని దట్టమైన పొదల్లోకి వెళ్లి అదృశ్యమయ్యాడు. అతని కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.

42 రైల్వేస్టేషన్లలో ఆటోమేటిక్ టిక్కెట్ యంత్రాలు

పెరంబూర్, జూన్ 3: చెన్నై రైల్వే డివిజన్ పరిధిలోని 42 ప్రాంతాల్లో ఆటోమేటిక్ టిక్కెట్ యంత్రాలు ఏర్పాటుచేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. దక్షిణ రైల్వే పరిధిలోని 166 ప్రాంతాల్లో 353 ఆటోమేటిక్ టిక్కెట్ యంత్రాలు ఏర్పాటుచేయగా, చెన్నై డివిజన్‌లో మాత్రమే 63 ప్రాంతాల్లో 128 యంత్రాలు ఏర్పాటయ్యాయి. తాజాగా, తాంబరం, మాంబళం, వేళచ్చేరి, గిండి, ఎగ్మూర్, పెరంబూర్, మైలాపూర్, చేపాక్కం సహా 42 ప్రాంతాల్లో 100 ఆటోమేటిక్ టిక్కెట్ యంత్రాలు ఏర్పాటుచేశారు. అలాగే, ఇక్కడ టిక్కెట్లు ఇచ్చేందుకు మాజీ ఉద్యోగులు, ప్రైవేటు వ్యక్తులను నియమించి, వారికి 3 శాతం కమీషన్ ఇవ్వనున్నామని, ఆసక్తి కలిగిన వారు ఈ నెల 20వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు దక్షిణ రైల్వే వెబ్‌సైట్ చూడవచ్చని అధికారులు తెలిపారు.

ఏప్రిల్, మే నెలల్లో తగ్గిన రిజిస్ట్రేషన్లు

ఐసిఎఫ్, జూన్ 3: గత ఏడాదితో పోల్చగా ఎన్నికల కారణంగా ఏప్రిల్, మే నెలల్లో రిజిస్ట్రేషన్లు తగ్గాయి. అయితే, ఆదాయం రూ.270 కోట్ల వరకు పెరిగింది. రిజిస్ట్రేషన్‌శాఖ ఆదాయం రెండేళ్లుగా పెరిగింది. 2018-19లో 25,73,478 పత్రాల రిజిస్ట్రేషన్ ద్వారా ప్రభుత్వానికి రూ.11,071 కోట్ల ఆదాయం లభించింది. ఇప్పటివరకు ఇదే గరిష్టంగా ఉంది. ప్రస్తుతం ఈ శాఖలో కొన్ని సవరణలు చేపట్టడంతో 2022-23 సంవత్సరంలో 34,41,248 రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.17,296 కోట్లు ఆదాయం లభించింది. 2023-24లో రూ.20,207 కోట్ల ఆదాయం లభించింది. స్టాంపు పేపర్ల రుసుము గతంలో 9 శాతం ఉండగా, ప్రస్తుతం 7 శాతానికి తగ్గించినా రిజిస్ట్రేషన్ ఆదాయం తగ్గలేదు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆదాయ లక్ష్యం రూ.23,750 కోట్లుగా నిర్ణయించారు. ఈ లక్ష్యం చేరుకుంటే 2018 నాటి ఆదాయం కన్నా 2024 సంవత్సర ఆదాయం 50 శాతం పెరిగే అవకాశమున్నట్లు అధికారులు తెలిపారు.

కంప్యూటర్ అసిస్టెంట్ల నియామకం

పెరంబూర్, జూన్ 3: ప్రభుత్వ పాఠశాలల్లోని అత్యాధునిక లాబొరేటరీల నిర్వహణకు 8,209 మంది కంప్యూటర్ ఆపరేటర్ల నియమాకాలను ప్రైవేటు సంస్థ చేపట్టనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యాసాన్ని మెరుగుపరచడం, సాంకేతికత ఉపయోగించి నేర్చుకొనేలా 22,933 స్మార్ట్ బోర్డులు, 8,209 హైటెక్ లాబొరేటర్లు ఏర్పాటుకానున్నాయి. ఈ నేపథ్యంలో, ఈ ల్యాబ్‌ల్లో 8,209 మంది కంప్యూటర్ అసిస్టెంట్ నియామకాలకు కెల్ట్రాన్ అనే సంస్థ చేపట్టనుంది. ఈ నియామకాలకు సంబంధించిన ఆన్‌లైన్ పరీక్ష బుధవారం జరుగనుంది. ఈ మేరకు సమీకృత పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర ప్రోగ్రామ్ డైరెక్టర్ ఎం.ఆర్తి అన్ని జిల్లాల విద్యాధికారులకు సర్క్యులర్ పంపారు. ప్రైవేటు సంస్థ ద్వారా నియమితులవుతున్న ఈ కంప్యూటర్ అసిస్టెంట్లు ఐదేళ్లు పనిచేయనున్నారు.

‘హెల్మెట్ లేకుండా సెల్‌ఫోన్ డ్రైవింగ్’

● మహిళా కానిస్టేబుల్‌కు రూ.2,000 జరిమానా



పెరంబూర్, జూన్ 3: తిరుచ్చి కల్లనై రోడ్డులో, శ్రీరంగం పోలీస్‌స్టేషన్ నుంచి న్యాయస్థానం వరకు కానిస్టేబుల్ సెల్వరాణి, యూనిఫాంతో హెల్మెట్ లేకుండా సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ద్విచక్రవాహనంపై వెళ్లింది. ఈ దృశ్యాన్ని కొందరు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దానిపై స్పందించిన నెటిజన్లు, ప్రజలకు ఒక న్యాయం, పోలీసులకు మరో న్యాయమా అంటూ విమర్శలు గుప్పించారు. ఈ వ్యవహారంపై స్పందించిన ట్రాఫిక్ పోలీసులు సదరు మహిళా కానిస్టేబుల్‌కు రూ.2,000 జరిమానా విధించారు.

తామ్రభరణి నదిలో వ్యర్థాల తొలగింపు



తొలగించిన వ్యర్థాలతో కార్మికులు

పెరంబూర్, జూన్ 3: తిరునల్వేలి జిల్లా పాపనాశం తామ్రభరణి నదిలో చేపట్టిన 21 రోజుల పారిశుధ్య ముగిశాయి. మొత్తం 96 టన్నుల చెత్త తొలగించారు. యానైపాళయం నుంచి తలయనై వరకు 3 కి.మీ దూరం వరకు జిల్లా కలెక్టర్ కార్తికేయన్ ఉత్తర్వులతో శుభ్రం చేశారు. 21 రోజులు జరిగిన పనుల్లో టన్నుల కొద్దీ చెత్త బట్టలు, 325 కిలోల బాటిళ్లు, 550 కిలోల చెప్పులు, 2,445 కిలోల సబ్బు, షాంపు, ప్యాకింగ్ కవర్లు, పాలిథిల్ బ్యాగులు, దండలు, 699 కిలోల కాలిన బియ్యం తదితరాలను సిబ్బంది తొలగించారు. ఈ నది తీరంలో పితృదేవతలు భక్తులు తర్పణాలు పెడుతున్న సమయంలో బట్టలు, ఇతర పూజా సామగ్రి అక్కడే వదిలి వెళుతుంటారని అధికారులు తెలిపారు.

కృష్ణగిరి సమీపంలో 17 ఉడుములు స్వాధీనం

● ముగ్గురి అరెస్ట్



ఉడుములతో పట్టుబడిన నిందితులు

పెరంబూర్, జూన్ 3: కృష్ణగిరి సమీపంలో 17 ఉడుములు స్వాధీనం చేసుకున్న పోలీసులు, ముగ్గురిని అరెస్ట్ చేశారు. కృష్ణగిరి సమీపం బెంగళూరు జాతీయ రహదారిలో సిక్కారిమేడు అనే ప్రాంతానికి చెందిన ఉడుము రక్తం, మాంసంతో వంటలు, మసాజ్ తదితరాలకు వినియోగిస్తున్నారని అటవీ శాఖ అధికారులకు సమాచారం అందింది. కృష్ణగిరి మార్గంలో రెండు బస్సులను అడ్డుకున్న అధికారులు తనిఖీ చేపట్టి, అక్రమంగా తరలిస్తున్న 17 ఉడుములు స్వాధీనం చేసుకున్నారు. తంజావూరు నుంచి వీటిని తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ వ్యవహారంలో పుదుకోట జిల్లా రొక్కంపాళసత్రం గ్రామానికి చెందిన కార్తీక్ (35), కృష్ణగిరి జిల్లా సిక్కారిమేడు గ్రామానికి చెందిన దేవ (28), ఏరియూరు గ్రామానికి చెందిన రాజాలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారు అందించిన సమాచారంతో ఆరుగురికి కేసు నమోదుచేసిన అధికారులు, మిగిలిన వారి కోసం గాలిస్తున్నారు.

ప్రేమ వివాహం చేసుకున్న యువతి ఆత్మహత్య



నివేదిత (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, జూన్ 3: ప్రేమ వివాహం చేసుకున్న యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. కరూర్ జిల్లా సేందమంగళం సమీపం పుదుపట్టి ప్రాంతానికి చెందిన సుబ్రమణియన్ కుమార్తె నివేదిత (25) అన్నామలై విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ చదువుతున్న సమయంలో, అదే వర్సిటీలో చదువుతున్న కడలూరు జిల్లా చిదంబరం సమీపం పల్లిపడైతిల్లయమ్మన్ నగర్‌కు చెందిన సుభాష్ చంద్రబోస్ (30)ను ప్రేమించింది. వీరు 2022 డిసెంబరు 27న వివాహం చేసుకొని పల్లిపడైతిల్లయమ్మన్ నగర్‌లో నివసిస్తున్నారు. శనివారం రాత్రి నివేదిత ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కాగా, తన కుమార్తె ఆత్మహత్యపై సందేహం ఉందని నివేదిత తల్లి చిదంబరం నగర పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు, నివేదిత ఆత్మహత్యకు పాల్పడిందా? మరేదైనా జరిగిందా? అనే కోణాల్లో విచారిస్తున్నారు.

భార్యను హతమార్చి భర్త ఆత్మహత్య



ప్రభాకరన్-ఆషా (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, జూన్ 3: భార్యను హతమార్చి భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తూత్తుకుడి జిల్లాలో చోటుచేసుకుంది. సాతాన్‌కుళం సమీపం కలుంగువిలైకి చెందిన భీంసింగ్ (48),ఆషా (34) దంపతులకు ప్రభాకరన్ (13) అనే కుమారుడున్నాడు. కొద్దికాలంగా భార్యను అనుమానించిన ప్రభాకరన్, ఆమె ఎక్కడికి వెళ్లినా వెనుకే వెళ్తుంటాడని సమాచారం. ఆదివారం రాత్రి వారి మధ్య తలెత్తిన వివాదం ఘర్షణకు దారితీసింది. దీంతో ఆగ్రహం చెందిన ప్రభాకరన్ కత్తితో ఆషా గొంతు కోసాడు. అనంతరం తోటలోకి వెళ్లి పురుగుల మందు తాగి వచ్చి భార్యపై పడుకొని మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

శ్రీవిల్లిపుత్తూర్‌లో కారుకు కేరళలో జరిమానా

పెరంబూర్, జూన్ 3: విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూర్‌లోని ఇంట్లో నిలిపిన కారుకు కేరళలో పాస్ ట్యాగ్ జరిమానా విధించారు. కేరళ రాష్ట్రంలోని త్రిసూర్-అంగమాలి మార్గంలోని టోల్ బూత్ వద్ద నిబంధనలు అతిక్రమించి దాటారంటూ రూ.90 జరిమానా విధించారు. ఈ చర్యలతో యజమాని జ్ఞానరాజ్ ఖంగుతిన్నాడు.

ఉమాపతి హీరోగా 'పిత్తల్ మాత్తి'



'పిత్తల్ మాత్తి'లో ఉమాపతి - సంస్కృతి

ప్రముఖ సీనియర్ నటుడు తంబి రామయ్య కుమారుడు ఉమాపతి హీరోగా నటించిన కొత్త చిత్రం 'పిత్తల్ మాత్తి'. మాణిక్య విద్య దర్శకత్వం వహించారు. సంస్కృతి హీరోయిన్. ఇతర పాత్రల్లో బాల శరవణన్, వినుత, లాల్, తంబి రామయ్య, దేవదర్శిణి, విద్యుల్లేఖ, నరేన్, కాదల్ సుకుమార్ తదితరులు నటించారు. ఎస్ఎన్ వెంకట్ ఛాయాగ్రహణం అందించిన ఈ చిత్రానికి మోసెస్ స్వరాలు సమకూర్చారు. అణగారిన ప్రజల జీవితాలను ఇతివృత్తంగా తీసుకుని శరవణ ఫిల్మ్ ఆర్ట్స్ పతాకంపై జి.శరవణన్ నిర్మించారు. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'జీవితంలో మంచి చెడు కోసం ఏం చేయాలి అనే అంశంతో స్క్రీన్‌ప్లే రూపొందించాం. కథలోని హీరో తన జీవితంలో ఏది మంచిది? చెడు అంటే ఏమిటి? ఈ విషయాలు తెలుసుకుని అతను జీవితంలో ఎలా ముందుకు వచ్చాడు? అనే అంశాలతో ఈ చిత్రాన్ని రూపొందించాం. తమిళం, తెలుగు భాషల్లో ఏకకాలంలో నిర్మించగా ఈ నెలలో విడుదల చేయనున్నాం' అని పేర్కొన్నారు. కాగా, శరవణ ఫిల్మ్ ఆర్ట్స్ పతాకంపై ఇప్పటివరకు నాలుగు చిత్రాలు రాగా, అవి మంచి విజయాలను సొంతం చేసుకున్నాయి. యోగిబాబు ప్రధాన పాత్రలో రూపొందుతున్న 'జోరా కై తట్టుంగ' చిత్రాన్ని 'పిత్తల్ మతి' విడుదల చేసిన తర్వాత రిలీజ్ చేస్తామని నిర్మాత శరవణన్ తెలిపారు.

చిత్రజ్యోతి





శరత్ కుమార్ దంపతులు - అంగప్రదక్షిణ చేస్తున్న శరత్ కుమార్

భార్య విజయం కోసం భర్త అంగప్రదక్షిణ

లోక్‌సభ ఎన్నికల్లో విరుదునగర్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన తన సతీమణి, సినీ నటి రాధిక విజయాన్ని ఆకాంక్షిస్తూ, ఆమె భర్త, సినీ నటుడు, బీజేపీ నేత ఆర్.శరత్ కుమార్ విరుదునగర్‌లోని పరాశక్తి మారియమ్మన్ ఆలయంలో సోమవారం అంగప్రదక్షిణ చేశారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు నేడు వెల్లడికానున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన తన భార్య కోసం మారియమ్మన్ ఆలయంలో అంగప్రదక్షిణ చేశారు. అలాగే, దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ ముచ్చటగా మూడోసారి ప్రధానమంత్రి కావాలని ఆయన అమ్మవారిని వేడుకున్నారు. తడి వస్త్రాలతోనే శరత్ కుమార్ దంపతులు అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అక్కడ నుంచి శ్రీవిల్లిపుత్తూరు ఆండాళ్ ఆలయానికి రాధికా శరత్ కుమార్ దంపతులు వెళ్ళారు. శరత్ కుమార్ అంగప్రదక్షిణకు సంబంధించిన వార్త సోషల్ మీడియాలో వైరల్ అయింది.

కలైంజర్‌కు తమిళ నిర్మాతల మండలి నివాళి

దివంగత మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే మాజీ అధ్యక్షుడు డాక్టర్ కలైంజర్ కరుణానిధి 101వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి తమిళ చిత్ర నిర్మాతల మండలి నివాళులర్పించింది. అన్నాశాలైలోని నిర్మాతల మండలి కార్యాలయంలో కలైంజర్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో నిర్మాతల మండలి అధ్యక్షుడు మురళి ఎస్.రామస్వామి, కార్యదర్శి ఆర్.రాధాకృష్ణన్, సహాయ కార్యదర్శి సౌందరపాండ్యన్, కార్యవర్గ సభ్యులు ఎస్.విజయమురళి, జ్యోతి, ఢిల్లీబాబు, పన్నీర్‌సెల్వం, రాజా, ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు రవి కొట్టరకర, కార్యదర్శి కృష్ణా రెడ్డితో పాటు అనేక మంది నిర్మాతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్రపరిశ్రమకు కలైంజర్ చేసిన సేవలను వారు స్మరించుకున్నారు.



కలైంజర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నిర్మాతలు



'వేట్టైయన్'లో రజినీకాంత్



'వేట్టైయన్' విడుదల తేదీ వెల్లడించిన రజినీ!

టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో తాను నటిస్తున్న 'వేట్టైయన్' చిత్రం విడుదల తేదీని హీరో సూపర్‌స్టార్ రజినీకాంత్ సూచన ప్రాయంగా వెల్లడించారు. అక్టోబరు పదో తేదీ ఈ చిత్రాన్ని విడుదల చేసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన హిమాలయాల పర్యటనల్లో ఉన్నారు. ఈ సందర్భంగా రజినీకాంత్ మీడియాతో మాట్లాడుతూ, 'యంగ్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో రూపొందనున్న 'కూలీ' చిత్రం షూటింగ్ ఈ నెల 10 నుంచి ప్రారంభమవుతుంది. 'వేట్టైయన్' చిత్రాన్ని అక్టోబరు పదో తేదీన విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని పేర్కొన్నారు. తన ఆధ్యాత్మిక హిమాలయ పర్యటనపై ఆయన స్పందిస్తూ, 'ప్రతి యేడాది ఇలా యాత్ర చేయడం వల్ల కొత్త అనుభూతి పొందుతాను. అందరికీ ఇలాంటి ప్రయాణం అవసరం. దీనివల్ల ప్రశాంతత చేకూరుతుంది. దైవభక్తి పెరుగుతుంది' అని పేర్కొన్నారు.



హిమాలయాల్లో రజినీ

టీవీకే మహానాడు వాయిదా

- విజయ్ జన్మదిన వేడుకల్లో పేదలకు సహాయాలు



విజయ్

చెన్నై, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేత, ప్రముఖ సినీనటుడు విజయ్ ఈ నెల 22న తన జన్మదిన వేడుకల సందర్భంగా మదురైలో జరపాలనుకున్న పార్టీ మహానాడు వాయిదా పడింది. ఆ జన్మదిన వేడుకల్లో పార్టీ ఆధ్వర్యంలో భారీ యెత్తున సాంఘిక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించి నిరుపేదలకు సహాయాలు పంపిణీ చేయాలని ఆయన నిర్ణయించారు. రాష్ట్ర వ్యాప్తంగా 234 శాసనసభ నియోజకవర్గాలలో ఈ సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించాలని పార్టీ నిర్వాహకులకు ఆయన ఆదేశాలిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రమంతటా ఈ కార్యక్రమాల నిర్వహణకు పార్టీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇదిలా ఉండగా మదురైలో మహానాడు ఏర్పాట్లు అనుకున్న సమయానికి పూర్తికాదనే అనుమానంతోనే వాయిదా వేసినట్లు తెలుస్తోంది.

చరిత్రను ఎవరూ చెరపలేరు

గుడి కట్టి ఓట్లు అడుగుతున్నారు ● నటుడు ప్రకాష్ రాజ్ విసుర్లు



పుదుచ్చేరి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): చరిత్రను ఏ ఒక్కరూ చెరిపేయలేరని సినీ నటుడు ప్రకాష్ రాజ్ అన్నారు. పైగా తాను కన్నడిగుడినే అయినప్పటికీ- తమిళ చరిత్ర ఇక్కడి రాజకీయ నేతల కంటే బాగా తెలుసని ఆయన వ్యాఖ్యానించారు. ఆదివారం సాయంత్రం పుదుచ్చేరిలో డాక్టర్ కలైంజర్ కరుణానిధి శతజయంతి ముగింపు వేడుకల్లో పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించేందుకు నాంది పలికింది మొదట మాజీ సీఎం అన్నాదురై అని గుర్తు చేశారు. ఆ తర్వాత రాష్ట్రాన్ని పరిపాలించిన దివంగత కలైంజర్, డాక్టర్ ఎంజీఆర్ వంటివారు తమ వంతు కృషి అంచలంచెలుగా 69 శాతానికి తీసుకొస్తే, వాటికి పురట్చితలైవి జయలలిత రాజ్యాంగ షెడ్యూల్‌లో చేర్చి చట్టబద్ధత కల్పించారని గుర్తు చేశారు. ఈ విషయం తెలియని అన్నాడీఎంకే, బీజేపీ నేతలు తనపై నోరు పారేసుకుంటున్నారని మండిపడ్డారు. మన రాష్ట్ర రాజకీయాల్లో కులమతాలు పనిచేయవన్నారు. కావేరీ జలాల వివాదానికి కేంద్రం తగిన పరిష్కారం కనుగొనాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెయ్యేళ్ళపాటు జీవించే ప్రధానిగా భావించి ఎన్నికల ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ విద్య, పారిశ్రామికం, సైన్స్ రంగాలు ముఖ్యమన్నారు. కానీ, ప్రధాని మోదీ దేవుడికి గుడి కట్టించి ఓట్లు అడుగుతున్నారన్నారు. భారతదేశ చరిత్ర చాలా పెద్దదని, దాన్ని ఏ ఒక్కరూ చెరిపి వేయలేరన్నారు. తాను రాజకీయాలు చేస్తున్నానని, కానీ, ఏ రాజకీయ పార్టీలో లేనని గుర్తు చేశారు. ప్రజల భయమే శత్రువు బలమన్నారు. ప్రజల మనసుల్లో ఏముందో తనకు బాగా తెలుసని, దాన్నే తాను బహిరంగంగా వ్యక్తపరుస్తున్నానని తెలిపారు.

నా గెలుపు తథ్యం : ఓపీఎస్



తన గుర్తు పనస పండుతో పూజల్లో పాల్గొన్న ఓపీఎస్

పెరంబూర్, జూన్ 3: లోక్‌సభ ఎన్నికల్లో తన విజయం తథ్యమని, కేంద్ర మంత్రి పదవి లభించడం దేవుడి చేతిలో ఉందని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కూటమిలో రామనాథపురం నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పన్నీర్‌సెల్వం పోటీచేసిన విషయం తెలిసిందే. మంగళవారం జరుగున్న ఓట్ల లెక్కింపు సందర్భంగా విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూర్ సెంబగతోపులో ఉన్న తన కులదైవం పేచ్చియమ్మన్ ఆలయంలో ఓపీఎస్ పూజలు చేశారు. తనకు కేటాయించిన పనస పండును దైవ సన్నిధిలో ఉంచి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఓపీఎస్ మాట్లాడుతూ... దేశ ప్రధానిగా మూడో సారి ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటవుతుందన్నారు. పార్టీని ద్రోహుల చేతుల నుంచి విడిపించేలా అన్నాడీఎంకే హక్కుల పరిరక్షణ కమిటీ ఏర్పాటుచేసినట్లు ఓపీఎస్ తెలిపారు.

రేపటి నుంచి అఖిల భారత బాస్కెట్ బాల్ టోర్నీ



సెమీ ఇండోర్ స్టేడియం

అడయార్, జూన్ 3: ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు అఖిల భారత బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా పురుషుల కోసం 57వ నాచ్చిముత్తు గౌండర్ కప్, మహిళల కోసం 21వ సీఆర్ఐ పంప్స్ ట్రోఫీ నిర్వహించనున్నారు. కోయంబత్తూరు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్, కోయంబత్తూరు కార్పొరేషన్ సంయుక్తంగా ఈ మెగా టోర్నీని కోవైలోని సెమీఇండోర్ స్టేడియంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. ఇందులో స్త్రీ పురుషులకు ప్రత్యేకంగా సౌకర్యాలను కల్పించారు మహిళల టోర్నీ కోసం మొత్తం 8 జట్లను ఎంపిక చేశారు. ఇందులో త్రివేండ్రం - కేరళ స్టేట్ ఎలక్ట్రిసిటి బోర్డు, ముంబై - వెస్ట్రన్ రైల్వే, చెన్నై - సదరన్ రైల్వే, చెన్నై - రైజింగ్ స్టార్, కోల్‌కతా -ఈస్టన్ రైల్వే, సికింద్రాబాద్ - సౌత్ సెంట్రల్ రైల్వే, కోయంబత్తూరు - కోవై డిస్ట్రిక్ట్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉన్నాయి. అదేవిధంగా పురుషుల విభాగంలో కూడా చెన్నై - ఇన్‌కమ్ ట్యాక్స్, చెన్నై ఇండియన్ బ్యాంకు, బెంగళూరు బ్యాంక్ ఆఫ్ బరోడా, లక్నో యూపీ పోలీస్, న్యూఢిల్లీ సెంట్రల్ సెక్రటేరియట్, చెన్నై - లయోలా టీం, త్రివేండ్రం కేఎస్ఈబీ, సీడీబీఏ జట్లున్నాయి. విజేత జట్లకు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలను అందజేస్తారు.

దక్షిణ రైల్వే పీసీసీఎంగా కె.బెజి జార్జ్



అడయార్, జూన్ 3: దక్షిణ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ (పీసీసీఎం)గా కె.బెజి జార్జ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హెచ్ఎల్ఎల్ లైఫ్ కేర్ ఛైర్మన్‌గా విధులు నిర్వహించిన ఆయన... రైల్వే మంత్రిత్వ శాఖలో వివిధ హోదాల్లో కొనసాగారు. రైల్వే బోర్డు ప్లానింగ్ డైరెక్టరుగా, కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీనియర్ జనరల్ మేనేజరుగా, సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్ జనరల్ మేనేజర్ సీఈవోగాను, చీఫ్ ట్రాఫిక్ ప్లానింగ్ మేనేజరుగా ఇలా అనేక పోస్టుల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించారు. ఈయన చేసిన సేవలకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మక రైల్వే మినిస్టర్ అవార్డు కూడా వరించింది. ఇపుడు నీను ఇట్టిరహ స్థానంలో పీసీసీఎంగా బెజి జార్జ్ బాధ్యతలు స్వీకరించారు.

వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్‌కు అభినందన సభ



వీఐటీ ఛాన్సలర్‌కు చెక్ అందజేస్తున్న నిర్వాహకులు

వేలూరు, జూన్ 3: అమెరికా దేశంలో ప్రసిద్ధిచెందిన న్యూయార్క్ పింగామేటన్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందిన వీఐటీ విశ్వవిద్యాలయ ఛాన్సలర్ విశ్వనాథన్ అభినందన సభ సోమవారం జరిగింది. స్థానిక కల్యాణ మండపంలోని జరిగిన వేడుకలకు రాణిపేట జిల్లా సెక్రటరీ రాణిపేట సుకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన పలు సంస్థల ప్రతినిధులు, ఛాన్సలర్ విశ్వనాథన్‌ను అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా వీఐటీ వర్సిటీ నిర్వహిస్తున్న యూనివర్సల్ హైయ్యర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్‌కు రూ.5 లక్షల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు హోటళ్ల సంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి సదాశివం, కోయంబత్తూర్ కేజీ ఆస్పత్రి అధ్యక్షుడు భక్తవత్సలం, వ్యవసాయాధికారి రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పనిచేయనున్న వండలూరు పార్క్



పెరంబూర్, జూన్ 3: స్థానిక వండలూరు జూ పార్క్ మంగళవారం పనిచేయనుంది. ఈ పార్క్‌కు ప్రతి మంగళవారం సెలవు కాగా, ఆ రోజు పార్క్‌లో పారిశుధ్యం, మరమ్మతులు చేపడుతుంటారు. ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు కావడంతో పిల్లలతో పార్క్‌కు వస్తున్న వారి సంఖ్య పెరిగింది. వారి సౌకర్యార్థం సెలవు రోజైన ఈ నెల 4వ తేది పార్క్ యధావిధిగా పనిచేస్తుందని నిర్వాహకులు తెలిపారు.

ఎక్స్‌క్లూజివ్ డ్రోన్ షోరూమ్



అడయార్, జూన్ 3: దేశంలోనే తొలిసారి ఎక్స్‌క్లూజివ్ డ్రోన్ షోరూమ్‌ను గరుడ ఏరోస్పేస్ లిమిటెడ్ తాజాగా ప్రారంభించింది. డబుల్ డ్యుయల్ సర్టిఫికెట్ కలిగిన ఏకైక కంపెనీగా గుర్తింపు పొందిన గరుడ ఏరోస్పేస్... చిన్న, మధ్యతరహా డ్రోన్ పైలట్ లైసెన్సింగ్ ట్రైనింగ్ కూడా ఇచ్చేందుకు డీజీసీఏ అనుమతిచ్చింది. ఈ నేపథ్యంలో ఫస్ట్ ఎక్స్‌క్లూజివ్ డ్రోన్ షోరూమ్‌ను గరుడ ఏరోస్పేస్ సీఈవో అగ్నిశ్వర్ జయప్రకాష్ సమక్షంలో అన్నా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్.వేల్‌రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అగ్నిశ్వర్ మాట్లాడుతూ, తమ సంస్థ ఇప్పటివరకు 2500కు పైచిలుకు డ్రోన్లను విక్రయించామని, వీటిలో 2 వేల అగ్రి డ్రోన్లు ఉన్నట్టు తెలిపారు. వచ్చే రెండేళ్ళలో 25 వేల డ్రోన్లను విక్రయించాలన్న లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన పేర్కొన్నారు.



ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా చెన్నైలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు



చెన్నై మెరీనాబీచ్ వద్ద వెటర్నరీ శాఖ, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో శునకాలకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జే రాధాకృష్ణన్

బన్రూట్టిలో పనసపండ్ల ఉత్సవం

చెన్నై, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లాలో పనసపండ్ల తోటలకు ప్రసిద్ధిగాంచిన బన్రూట్టిలో పనసపండ్ల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. రాష్ట్ర వ్యవసాయ, ఉద్యానవన శాఖకు సంబంధించిన పథకాలు, పంటసాగు, పనస పండ్ల రకాలు, వాటి ప్రయోజనాలు గురించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యాన్ని అధికారులు వివరించారు. ఆ సందర్భంగా బన్రూట్టి పనసపండ్ల ప్రత్యేకతలు, పనసపండ్ల అమ్మకానికి మార్కెట్ సదుపాయాలు అందరికీ తెలిసేలా ఈ ఉత్సవాలు నిర్వహించారు. ఆ సందర్భంగా పనసపండ్ల తయారైన శీతలపానీయం, బిర్యానీ, ఐస్‌క్రీమ్‌తో ప్రదర్శన కూడా ఏర్పాటు చేశారు.



బన్రూట్టిలో పనస పండ్లను ప్రదర్శిస్తున్న రైతులు